
సభలో అమరావతి రైతులు, మహిళలు

అమరావతి అన్నదాతల మహాపోరాటం 1500 రోజులకు చేరింది. ఈ సందర్భంగా రాజధాని గ్రామాలైన వెలగపూడి, మందడం గ్రామాల్లో గురువారానికి నిర్వహించిన సభలు దిగ్విజయంగా జరిగాయి. అమరావతి నిర్మాణం సాకారమయ్యే వరకు పోరాటం సాగిస్తామని రైతులు, మహిళలు ప్రతినబూనారు. రాజధానివాసులను పట్టిపీడిస్తున్న జగన్ రాక్షస పాలనను అంతమొందిస్తామని సవాల్ చేశారు.

- జగన్‌పై విరుచుకుపడిన అఖిలపక్ష నేతలు
- వెలగపూడి, మందడం వేదికగా నేతల హెచ్చరికలు
- మూడు నెలల్లో సైతాను పాలన అంతం
- ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి
- 'అమరావతి సమర శంఖారావం' సభలో నేతల భరోసా

అమరావతి.. సమరభేరి


1500 అంకె రూపంలో అమరావతి రైతుల ప్రదర్శన

● ఆకట్టుకున్న ఆటాపాట... కోలాట ప్రదర్శన

రాజధాని ఉద్యమం 1500 రోజులకు చేరుకున్న సందర్భంగా ఆయా గ్రామాల్లో గురువారం సభలు నిర్వహించారు. అమరావతి జేఏసీ నేత పువ్వాడ సుధాకర్ అధ్యక్షతన వెలగపూడి శిబిరం వద్ద మొదలైన సభలో వేలాదిమంది రైతులు, మహిళలు, దళిత, బహుజనులు పాల్గొన్నారు. తొలుత అమరావతి అమరవీరులు 277 మందికి సభలో నివాళులు అర్పించారు. ఇటీవల మృతి చెందిన దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్ లూథర్ చిత్రపటానికి తొలుత నివాళులు అర్పించారు. అనంతరం అమరావతి ఉద్యమ నినాదభేరి చేశారు. అనంతరం ప్రాసమణి ప్రసంగంతో సభ ప్రారంభమైంది. అమరావతి ఉద్యమాన్ని, రైతులు, మహిళల త్యాగపూరిత పోరాటాన్ని తన ప్రాసలతో ఆయన శ్లాఘించారు. ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టారు. రాజధాని ఉద్యమ గాయకుడు రమణ తన ఆటపాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. రాజధాని గ్రామాల మహిళలు పలువురు కోలాట ప్రదర్శనతో అలరించారు.

తుళ్లూరు/గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రైతులు 1500 రోజులుగా సాగిస్తున్న ఉద్యమం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వం మారుతుంది.. నూటికి నూరుశాతం అమరావతే రాజధాని అని తేల్చి చెప్పారు. సీపీఎం నేత బాబూరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి ఆక్సిజన్ ఇస్తోందే మోదీ ప్రభుత్వమన్నారు. అమరావతి విషయంలో జగన్, మోదీలిద్దరూ నిందితులేనన్నారు. ఇరువురినీ గద్దె దించేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. పోలీసులు, లాఠీల దౌర్జన్యాలను ఢీకొని నిలబడిన అమరావతి రైతులకు మాజీ మంత్రి దేవినేని ఉమ అభినందనలు తెలిపారు. ప్రపంచ రాజధానిగా అమరావతిని చంద్రబాబు తీర్చి దిద్దుతారని హామీ ఇచ్చారు. అమరావతి రైతులే స్టార్ క్యాంపెయినర్లుగా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ అందరి ఉమ్మడి శత్రువుగా పరిణమించిన జగన్‌ను సాగనంపడానికి కలిసి కట్టుగా పోరాడాలన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు, హిందూ మహా సభ సభ్యుడు వెలగపూడి గోపాలకృష్ణ మాట్లాడారు.

● అమరావతిపై అసత్య ప్రచారాలు

వెలగపూడి శిబిరంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ సైకో జగన్ మీద మొట్టమొదట తిరుగుబాటు బావుటా ఎగర వేసింది అమరావతి రైతులేనన్నారు. మందడం సభలో శాసన మండల మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ మూడు రాజధానుల బిల్లును మండలిలో ఆమోదం పొందడానికి జగన్‌రెడ్డి అనేక ప్రలోభాలు చేశారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ముప్పాళ్ల నాగేశ్వరరావు, దళిత జేఏసీ నేత పోతుల బాలకోటయ్య, పిల్లి మాణిక్యరావు, ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి నేత కొలికిపూడి శ్రీనివాస్ మాట్లాడారు. సభలో విజయవాడ పార్లమెంటు ఇన్‌చార్జి కేశినేని శివనాథ్ (చిన్ని), కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, మైనార్టీ నేత ఫరూక్ షుబ్లి, బుచ్చిరామ్‌ప్రసాద్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ లీగల్ సెల్ గొట్టిపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

హరికథకు సముచిత గౌరవం

● బందరు కళాకారిణి ఉమామహేశ్వరికి పద్మశ్రీ



మచిలీపట్నం టౌన్, జనవరి 25 : పాశ్చాత్య కళలు ప్రజా బాహుళ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో మన చారిత్రక కళకు ప్రాణం వచ్చింది. ప్రజా కళల రాజసం తగ్గిపోతున్న సమయంలో హరికథకు అరుదైన గౌరవం దక్కింది. సంస్కృతంలో హరికథ చెప్పిన తొలి మహిళగా బందరుకు చెందిన ఉమామహేశ్వరికి కేంద్ర ప్రభుత్వం గురువారం పద్మశ్రీ ప్రకటించి గౌరవించింది. మచిలీపట్నం రామానాయుడుపేట షేక్ ఇమాం వీధిలో లాలాజీరావు, సరోజినీ దంపతులకు ఉమామహేశ్వరి 1960లో జన్మించారు. మచిలీపట్నంలో సంగీతం నేర్చుకున్నారు. వయొలిన్, వీణ, ఫ్లూట్‌లపై ఆమె హరికథ చెప్పడం ప్రారంభించారు. సంప్రదాయ సంగీత కుటుంబంలో జన్మించిన ఆమె వేములవాడ రాజరాజేశ్వరి దేవాలయంలో హరికథా గానం చేసేవారు. ప్రముఖ నాట్యాచార్యుడు కళాకృష్ణను 1995లో వివాహమాడారు. ఉజ్జయినీలో కాళిదాసు రచించిన కుమారసంభవం ఇతివృత్తాన్ని ఆధారం చేసుకుని సంస్కృతంలో హరికథను గానం చేశారు. కపిలేశరపురం సర్వరాయ హరికథా పాఠశాలలో హరికథను అభ్యసించారు. ఆ తరువాత ఆమె అంచెలంచెలుగా ఎదిగి జాతీయస్థాయి కళాకారిణిగా గుర్తింపు పొందారు. వేములవాడ రాజరాజేశ్వరి దేవస్థానం ఆస్థాన విద్వాంసురాలిగా ఆమె సంగీత ప్రపంచానికి సేవలందించారు. 1989లో బదరీనాథ్‌లో ఆమె ఆదిశంకరాచార్యునిపై చెప్పిన హరికథ ప్రముఖులను ఆకర్షించింది. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, నీలం సంజీవరెడ్డి, జ్ఞాని జైల్‌సింగ్, పండిట్ శంకర్‌దయాళ్ శర్మలు ఈమె హరికథాగానం విన్నారు. మాజీ ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, ఎన్టీ రామారావు, మాజీ గవర్నర్ భీష్మ నారాయణ సింగ్ వీరిని ప్రశంసించారు. 1993లో అమెరికా, 2003లో సింగపూర్, ఇండోనేషియాలో హరికథాగానం చేశారు. ఆమె ఆడియో, వీడియోలు జన బాహుళ్యంలోకి వెళ్లాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ వీరికి అవార్డులు ఇచ్చి గౌరవించింది.

పదింతల నిర్లక్ష్యం

- పదో తరగతి సత్ఫలితాల కోసం శ్రద్ధ పెట్టని అధికారులు
- మూడు సబ్జెక్టుల్లో విద్యార్థుల వెనుకంజ
- నిధులు రాక తేలని స్నాక్స్ వ్యవహారం
- అందరికీ అందని స్టడీ మెటీరియల్

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇప్పటికీ అందలేదు. ఇప్పటి వరకూ నిధులు కేటాయించకపోవడంతో స్నాక్స్ ఎప్పటి నుంచి అందిస్తారో ఇప్పటికీ స్పష్టత లేదు. మూడు సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకంజలో ఉన్నట్టు అధికారుల పరిశీలనలో తేలింది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగనున్నాయి. జిల్లాలో 395 ఉన్నత పాఠశాలల నుంచి 26,529 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 16,117 మంది ఈ ఏడాది పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కష్టతరమైన సైన్స్, లెక్కలు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో విదార్థులు వెనుకంజలో ఉన్నట్టు ఉన్నతాధికారుల పరిశీలనలో వెల్లడైంది.

● 151 పరీక్షా కేంద్రాలు

జిల్లాలో 151 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం ఇన్విజిలేటర్ల నియామకం చేయాలని డీవైఈవోలు, ఎంఈవోలకు విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 29 పోలీస్‌స్టేషన్‌లలో ప్రశ్నాపత్రాలు భద్రపరిచేలా చర్యలు తీసుకోనున్నారు.

● మూడు సబ్జెక్టుల్లో వెనుకంజ

సైన్స్, లెక్కలు సబ్జెక్టులను అవగాహన చేసుకోవటంలో విద్యార్థులు వెనుకంజలో ఉన్నారు. గతంలో జేసీగా పనిచేసిన అపరాజిత సింగ్.. విద్యార్థులు సైన్సు సబ్జెక్టులో సరైన సమాధానాలు చెప్పకపోవటం గమనించి ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుత కలెక్టర్ పాఠశాలలను సందర్శించి బోధనా పద్ధతుల లోటుపాట్లను గుర్తించారు. పిల్లలకు పాఠాలు బోధించే అంశంపై లోటుపాట్లను సరిదిద్దేందుకు కొంతకాలంగా ప్రధానోపాధ్యాయులతో వెబ్ సమావేశాలు ఏర్పాటుచేసి పలు సూచనలు చేస్తున్నారు. ఇప్పుడున్న తక్కువ సమయంలో ఈ ప్రక్రియ ఎంతమేరకు సత్ఫలితాలను ఇస్తుందో వేచిచూడాలి.



● స్నాక్స్ ఎప్పటి నుంచీ?

ప్రతిఏటా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే రోజుల్లో సాయంత్రం సమయంలో స్నాక్స్ పంపిణీ చేసేవారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాకు రూ.45 లక్షలు నిధులను ఏటా విడుదల చేసేవారు. ఈ ఏడాది నిధులు ఎప్పటికి విడుదల చేస్తారనే అంశంపై సందిగ్ధత నెలకొంది. జడ్పీ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో నేటికీ అందలేదు.

● నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం


పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా ర్యాంకును మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా దృష్టిసారించాం. సీ, డీ గ్రేడుల విద్యార్థులు చదువులో ముందంజలో ఉండేవిధంగా ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. జిల్లా పరిషత్ నిధులతో విద్యార్థులకు సాయంత్రం సమయంలో స్నాక్స్ అందించేందుకు నిధులు విడుదల చేయాలని జెడ్పీ అధికారులను కోరాం.

- డీఈవో తాహెరా సుల్తానా

అట్నుంచి ఇటూ

- సెంట్రల్‌ను ఆక్రమిస్తున్న పశ్చిమ వైసీపీ నేతలు
- డివిజన్ ఇన్‌చార్జులుగా పశ్చిమ నేతల నియామకం
- దుర్గగుడి చైర్మన్, మేయర్ భర్తకూ బాధ్యతలు
- వెలంపల్లి తీరుపై రగిలిపోతున్న సెంట్రల్ వైసీపీ నాయకులు
- తమపై స్థానికేతరుల పెత్తనమేంటని లోలోపల ఆగ్రహం

సెంట్రల్ నియోజకవర్గ వైసీపీలో ముసలం రోజురోజుకూ ముదురుతోంది. సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును కాదని స్థానికేతరుడైన పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ఇక్కడ టికెట్ ఇవ్వడంపై స్థానిక వైసీపీ నేతలు తొలి నుంచి ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. తాజాగా సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లకు స్థానికేతరులను ఇన్‌చార్జులుగా నియమించడం, గురువారం జరిగిన కార్యాలయ ప్రారంభోత్సవంలో వారిదే పెత్తనం కావడంతో ఆగ్రహానికి ఆజ్యం పోసినట్లైంది.


వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ నియోజకవర్గంలో 21 డివిజన్లు ఉన్నాయి. వీటిలో 16 డివిజన్లకు వైసీపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం అన్ని డివిజన్లకు కార్పొరేటర్లతో పాటు డివిజన్ కో-ఆర్డినేటర్లు ఉన్నారు. వీరంతా మల్లాది విష్ణు మనుషులు కావడంతో తనకు ఎంతవరకు సహకరిస్తారన్న అనుమానం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో గురువారం 21 డివిజన్లకు ఇన్‌చార్జులను నియమిస్తూ వెలంపల్లి ఓ జాబితా విడుదల చేశారు. వీరంతా సెంట్రల్ నియోజకవర్గానికి చెందినవారైతే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కానీ, 21 మందిలో ఒక్కరు కూడా స్థానికులు లేరు. అందరూ పశ్చిమ నియోజకవర్గానికి చెందినవారే. వీరిని ఇన్‌చార్జులుగా నియమించడంతో స్థానిక నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. డివిజన్ ఇన్‌చార్జులుగా నియమితులైన వారిలో దుర్గగుడి చైర్మన్, మేయర్ భర్త కూడా ఉండటం విశేషం. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబును 60వ డివిజన్ ఇన్‌చార్జిగా నియమించారు. వెలంపల్లి అవినీతిలో కీలక భాగస్వామిగా పేరొందిన కొండపల్లి బుజ్జిని 29వ డివిజన్ ఇన్‌చార్జిగా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి భర్త నరేంద్రను 31వ డివిజన్ ఇన్‌చార్జిగా నియమించారు.

ఇప్పుడే ఇలా.. గెలిస్తే ఎలా..?

స్థానిక నాయకులను చేతగాని వారిగా పరిగణించి పొరుగున ఉన్న పశ్చిమ నాయకులను ఇక్కడికి దిగుమతి చేయడం ఏమిటని, ఇది తమను అవమానించడమేనని కార్పొరేటర్లు అంతర్గత చర్చల్లో మాట్లాడుకుంటున్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీకి మంచి నాయకత్వమే ఉంది. సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, కార్పొరేటర్ జానారెడ్డి, డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డి, తోట శ్రీనివాస్ వంటి నాయకులు ఉన్నారు. వీరిలో ఒక్కరు కూడా వెలంపల్లిని మనస్ఫూర్తిగా స్వాగతించడం లేదని వారి అనుచరగణమే చెబుతోంది. వెలంపల్లి పొరపాటున సెంట్రల్‌లో గెలిస్తే ఇక్కడే పాతుకుపోతాడని, ఈ ఎలక్షన్లలో కాకపోతే వచ్చే ఎన్నికల్లోనైనా సీటు దక్కుతుందన్న ఆశతో ఉన్న పై నాయకుల ఆశలన్నీ ఆవిరైపోతాయని, ఈ కారణంగా వెలంపల్లి గెలవడానికి వీరెవ్వరూ సహకరించే పరిస్థితి లేదని వైసీపీకి చెందిన ఓ సీనియర్ కార్పొరేటర్ వ్యాఖ్యానించారు.

సజ్జల రాక వెనుక కారణమదే..

వైసీపీ సెంట్రల్ కార్యాలయ ప్రారంభోత్సవానికి గురువారం సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. సజ్జల రాక వెనుక పెద్ద కథే నడిచింది. కార్యాలయ ప్రారంభోత్సవానికి సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును వెలంపల్లి ఆహ్వానించగా, ఆయన నుంచి స్పందన రాలేదు. దీంతో విష్ణు హాజరుకాకుంటే దాని ప్రభావం కచ్చితంగా ఎన్నికల ప్రచారంపై పడుతుందని, ఆదిలోనే హంసపాదుగా మారుతుందని భావించిన వెలంపల్లి చక్రం తిప్పి సజ్జలను కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానించినట్లు వైసీపీ వర్గాల సమాచారం. సజ్జల రావడంతో విష్ణు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో హాజరయ్యారు. దీంతో వెలంపల్లి వర్గం ఊపిరిపీల్చుకుంది.

ఎన్నికలకు ముందే.. నోట్ల కట్టలు!

- రహదారిపై పోలీసుల తనిఖీలు
- పలుచోట్ల భారీగా నగదు స్వాధీనం

- 6లో..

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు

బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డు

» గవర్నర్ నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్

కృష్ణలంక, జనవరి 25 : ఎన్నికల ప్రక్రియలో సమర్థవంతమైన సేవలు అందించినందుకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డు వరించింది. రాష్ట్రంలో ముగ్గురు కలెక్టర్లకు మాత్రమే ఈ అవార్డులు వరించగా.. వారిలో ఢిల్లీరావు ఒకరు. గురువారం గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి కలెక్టర్ అవార్డును అందుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని ప్రజలకు వివరించి అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో చేర్పించడంలోను, ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో కృతకృత్యులవ్వాలని కలెక్టర్ ఢిల్లీరావును గవర్నర్ అభినందించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తుది ఓటర్ల జాబితా రూపకల్పనలో, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల్లో విశిష్ట సేవలందించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పురస్కారాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యవ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాల్సిన అవసరముందన్నారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, జిల్లా అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలకు అప్పగించిన బాధ్యతలను సమిష్టి కృషితో సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా పురస్కారం లభించిందన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పురస్కారం లభించినట్టే అని పేర్కొన్నారు. చేసిన కృషిని గుర్తించి జిల్లాకు అవార్డును అందించినందుకు గవర్నర్, ఈసీఐ, సీఈఓలకు ధన్యవాదాలు తెలిపారు.



బీఎల్‌వోలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్‌వోల సేవలు భేష్

కృష్ణలంక, జనవరి 25 : ఎన్టీఆర్ జిల్లా ఎస్ఎస్ఆర్-2024 ఓటర్ల జాబితా రూపకల్పనలో క్షేత్రస్థాయిలో బూత్‌స్థాయి అధికారుల (బీఎల్ఓ) సేవలను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తుది ఓటర్ల జాబితా రూపకల్పనలో నిబద్ధతతో సేవలందించిన 48 మంది బీఎల్‌వోలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా పరిశీలనకు ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు, స్వీప్ కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయడంలో బీఎల్‌వోలు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు.

భక్తితో.. ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

వన్‌టౌన్, జనవరి 25 : పౌర్ణమి సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలు, అమ్మవారి నామస్మరణలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గాఘాట్ సమీపంలో శ్రీ కామధేను అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 5.55 గంటలకు వేద పండితులు, అర్చకులు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ప్రచారరథంలో కొలువుదీరిన గంగా, పార్వతి సమేత మల్లేశ్వరస్వామివార్లకు భక్తులు పూలు, పండ్లు తదితరాలను సమర్పించి పూజలు చేసి ఆశీస్సులు అందుకున్నారు. గిరి ప్రదక్షిణ కుమ్మరిపాలెం సెంటర్, నాలుగుస్తంభాల సెంటర్, సితార సెంటర్, కబేళా, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి ఘాట్‌రోడ్డు మీదుగా డప్పులు, బేతాళ నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ తిరిగి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.



హుండీలలో నగదు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

తిరుపతమ్మ హుండీల ఆదాయం రూ.కోటి

పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారికి రూ.1,21,59,039 నగదు, 80 యూఎస్ఏ డాలర్లు, ఆస్ట్రేలియా కరెన్సీ 50 పౌండ్స్, 37 గ్రాముల బంగారం, 720 గ్రాముల వెండి ఆదాయంగా సమకూరినట్టు ఆలయ ఈవో, డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు తెలిపారు. జగ్గయ్యపేట గ్రూప్ టెంపుల్స్ ఈవో సి.జయప్రకాష్‌బాబు సమక్షంలో అమ్మవారి హుండీల ఆదాయం గురువారం లెక్కించగా 117 రోజులకు భక్తులు కానుకల రూపంలో పై మొత్తాన్ని సమర్పించినట్టు ఈవో తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు), ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

29 నుంచి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఉంగుటూరు, జనవరి 25 : కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి ఉచితశిక్షణా సంస్థ(యూబీఆర్ఎస్ఈటీఐ)లో ఈనెల 29 నుంచి బ్యూటీషియన్(30రోజులు), ఫోటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ (30రోజులు)లు, ఫిబ్రవరి మొదటివారంలో జ్యూట్‌బ్యాగుల తయారీ(13రోజులు)పై నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెల్లరేషన్‌కార్డు కలిగి, 18నుంచి 45సం.ల మధ్య వయసు, తెలుగులో చదవటం, రాయటం వచ్చిన కృష్ణా/ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణప్రాంతాలకు చెందిన అభ్యర్థులు పైన పేర్కొన్న చేతివృత్తుల్లో ఉచితశిక్షణకు అర్హులన్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. శిక్షణపూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు, కోర్సులకు సంబంధించిన మెటీరియల్‌ను ఉచితంగా అందించడంతోపాటు, వారి ఉపాధికి అవసరమైన సహాయ, సహకారాలు పూర్తిస్థాయిలో అందించటం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు నాలుగు పాస్‌పోర్టుసైజు ఫోటోలు, రేషన్, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణపత్రాల నకళ్లతో ఈనెల 29లోగా నేరుగా శిక్షణాకేంద్రానికి విచ్చేసి పేర్లను నమోదుచేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 6304254730, 9962512337, 9440772382 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మంత్రి జోగి ఆత్మీయ సమావేశానికి

ఎమ్మెల్యే సారథి వర్గం డుమ్మా!

కంకిపాడు, జనవరి 25 : పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి జోగి రమేశ్ నియోజకవర్గస్థాయి సమావేశానికి గురువారం కంకిపాడులోని ఓ హోటల్‌లో భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే సమావేశానికి సారథి వర్గం డుమ్మా కొట్టింది. సమావేశానికి ప్రధానంగా కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, దుర్గగుడి పాలకమండలి మాజీ సభ్యుడు నెరుసు సతీష్, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, పెనమలూరు మండలానికి చెందిన ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు వల్లె నరసింహారావు, ఉయ్యూరు మండలఅధ్యక్షులు హాజరు కాలేదు. వీరికి జోగి నుంచి ఆహ్వానం వెళ్లినా ఆత్మీయ సమావేశానికి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్‌లోకి రండి..

రాష్ట్ర పర్యటనలో భాగంగా దుట్టాను కలిసిన షర్మిల

రాజకీయాలకు దూరంగా ఉంటున్నా : దుట్టా



దుట్టాతో షర్మిల భేటీ

హనుమాన్‌జంక్షన్, జనవరి 25 : గన్నవరం నియోజక వర్గ వైసీపీ సీనియర్ నేత దుట్టా రామచంద్రరావును పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావాలని కోరారు. గురువారం రాష్ట్ర పర్యటనలో భాగంగా గన్నవరం వెళుతూ మార్గమధ్యలో హనుమాన్‌జంక్షన్‌లోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మిత్రుడు, సన్నిహితుడు సీనియర్ నేత దుట్టా రామచంద్రరావును ఆమె కలిశారు. కొద్ది సేపు మంతనాలు సాగించారు. కాంగ్రెస్ పార్టీకి మీలాంటి సీనియర్ నాయకులు అవసరం ఎంతో ఉందని, పార్టీకి పూర్వ వైభవం వస్తుందని చెప్పినట్టు సమాచారం. అయితే రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని దుట్టా సున్నితంగా తిరస్కరించినట్టు తెలిసింది. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ, రాజశేఖర్ బిడ్డగా దుట్టా రామచంద్రరావు తనను ఆశీర్వదించి. సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారన్నారు. దుట్టా రామచంద్రరావు కాంగ్రెస్ పార్టీలోకి చేరతారా అన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు వెరీ సూన్ అని షర్మిల బదులిచ్చారు. షర్మిల వెంట పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, పీసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ఉన్నారు.







బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ నరసింహమూర్తి, చౌటపల్లి వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, యాకమూరులో నగదుతో సీఐ కిషోర్‌బాబు

ఎన్నికలకు ముందే.. నోట్ల కట్టలు!

» రహదారులపై పోలీసుల తనిఖీలు » పలుచోట్ల భారీగా నగదు స్వాధీనం

ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉమ్మడి కృష్ణా జిల్లాల పోలీసు అధికారులు జాతీయ రహదారులపై వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో అనుమతులు లేని నగదు భారీగా పట్టుబడుతోంది. బుధ, గురువారాల్లోనే పోలీసు తనిఖీల్లో సరైన పత్రాలు చూపని సుమారు రూ. కోటికి పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు.

బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద రెండు కార్లలో

రూ. 60 లక్షలకు పైగా స్వాధీనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 25 : బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద గురువారం సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రెండుకార్లలో ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 52,50,000, రూ. 9.94లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం జేస్తూ బుధవారం రాత్రి కారులో నగదు తరలిస్తున్న ఇద్దరిని, భూమి అమ్మగా వచ్చిన సొమ్మని చెబుతూ గురువారం ఉదయం నగదుతో కాకినాడ నుంచి చెన్నయ్ వెళుతున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా భారీ మొత్తంలో నగదు రవాణాను తనిఖీల్లో గుర్తించి తహసీల్దార్‌కు, ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు సమాచారం అందించినట్టు సీఐ తెలిపారు. తనిఖీల్లో హనుమాన్‌జంక్షన్ ఎస్సై జనార్దన్, తిరుమలరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చౌటుపల్లి వద్ద రూ.61 లక్షలు సీజ్

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలం ముదినేపల్లి రోడ్డులో చౌటుపల్లి వద్ద రూరల్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.61 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. వేములపల్లి సత్యనారాయణ కారులో రూ.61 లక్షలు తరలిస్తుండగా సీజ్ చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో గుడివాడ రూరల్ సీఐ ఏసుబాబు, ఎస్ఐ లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

యాకమూరులో రూ. 9 లక్షలు..

తోట్లవల్లూరు : యాకమూరు చెక్‌పోస్టు వద్ద గురువారం వాహన తనిఖీల్లో ఎటువంటి పత్రాలు చూపని రూ. 9 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎం కిషోర్‌బాబు తెలిపారు.

పోరంకిలో రూ.8.80లక్షలు..

పెనమలూరు : పశ్చిమ గోదావరిజిల్లా ఉంగుటూరు మండలం వెలమిల్లి గ్రామానికి చెందిన వాకచర్ల వెంకటేశ్వరరావు బుధవారం పోరంకి వందడుగుల రోడ్డులో కారులో వెళుతుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించి ఎటువంటి పత్రాలు లేని రూ.8.80లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద రూ. 4.10లక్షలు..

ఉంగుటూరు : పొట్టిపాడు టోల్‌గేట్‌వద్ద గురువారం ఆత్కూరు ఎస్సై టి.సూర్యశ్రీనివాస్ నేతృత్వంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా ఐదుగురు వ్యక్తులు పిడుగురాళ్లనుంచి రావులపాలెంకు కారులో తరలిస్తున్న రూ.4.10లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫైనాన్స్ వ్యాపారం నిమిత్తం తీసుకెళ్తున్నట్టు సదరు వ్యక్తులు విచారణలో వెల్లడించినట్టు ఎస్సై తెలిపారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 25 : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. గురువారం స్టేడియంలో నిర్వహించిన రిహార్సల్స్‌ను ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు డైరక్టర్ జనరల్ బి.శంకర్‌బాత్ర భక్షి, ప్రొటోకాల్ డైరక్టర్, జీఏడీ డిప్యూటీ సెక్రటరీ ఎం.బాలసుబ్రమణ్యం రెడ్డి, కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర పోలీసు కమిషనర్ కాంతిరాణా తదితరులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్టేడియంలో రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని



రిహార్సల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు. వేడుకలకు ఉదయం 8.51లకు రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, 8.55లకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, 8.56లకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాగూర్, 5.57 రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, 8.58కు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రాంగణానికి చేరుకొంటారని తెలిపారు. ఉదయం 9గంటలకు గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి గణతంత్ర దినోత్సవ సందేశాన్ని ఇస్తారన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి పథకాలపై రూపొందించిన అలంకృత శకటాలను పరిశీలిస్తారని, ఉత్తమ ప్రదర్శన కనబరిచిన శకటాలకు, కవాతు బృందాలకు జ్ఞాపికలను అందచేస్తారన్నారు. వేడుకలో ఇండియన్ ఆర్మీ, సెంట్రల్ రిజర్వ్ పోలీసు, తమిళనాడు రాష్ట్ర పోలీసు, కర్నూల్ ఏపీఎస్పీ రెండో బెటాలియన్, విజయనగరం ఏపీఎస్పీ ఐదో బెటాలియన్, ఎన్‌సీసీ బాలబాలికలు తదితర బృందాలు కవాతులో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.



గణతంత్ర వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

బందరులో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

మచిలీపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భారత 75వ గణతంత్రదినోత్సవ జిల్లాస్థాయి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మచిలీపట్నంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం 9గంటలకు కలెక్టర్ పి.రాజాబాబు జాతీయజెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తారు. 9.15 గంటలకు జిల్లా ప్రగతిని వివరిస్తూ ప్రసంగిస్తారు. గణతంత్రవేడుకలను పురస్కరించుకుని జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి శకటాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పలు శాఖలకు సంబంధించి ప్రగతిని తెలియజేస్తూ స్టాల్స్, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధశాఖల్లో అత్యుత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను కలెక్టర్, జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ పి జాషువా అందజేస్తారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు, రిజర్వు పోలీస్ అధికారులు గురువారం పరిశీలించారు.

పద్మవిభూషణ్ చిరంజీవికి అభినందనలు - ఎంపీ బాలశౌరి

విజయవాడ, జనవరి 25 : ప్రముఖ సినీ నటుడు చిరంజీవికి పద్మవిభూషణ్ పురస్కారం రావడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. పద్మవిభూషణ్ పురస్కారం లభించిన సందర్భంగా ఆయన చిరంజీవికి అభినందనలు తెలియజేశారు. స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి చిరంజీవి అని, ఆయన క్రమశిక్షణ, కఠోర శ్రమే ఆయనకు ఈ పురస్కారం దక్కేలా చేసిందన్నారు. భారతరత్నకు అర్హుడైన వ్యక్తి అని ఆయనకు దేశ అత్యున్నత పురస్కారమూ దక్కాలని కోరుకుంటున్నట్టు బాలశౌరి పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఆయా ప్రాంతాలకు కేటాయించిన ప్రత్యేక రైళ్ల సేవల గడువును పొడిగించినట్టు గురువారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి -అకోలా ప్రత్యేక రైలు(07605)ఫిబ్రవరి 2 నుంచి మార్చి29 వరకు, అకోలా-తిరుపతి రైలు(07606) ఫిబ్రవరి4 నుంచి మార్చి31 వరకు, పూర్ణ-తిరుపతి రైలు (07609) ఫిబ్రవరి 5నుంచి మార్చి25వరకు, తిరుపతి-పూర్ణ రైలు(07610)ఫిబ్రవరి 6 నుంచి మార్చి26 వరకు పొడిగించారు. అలాగే హైదరాబాద్-నర్సాపూర్ రైలు(07631), లింగంపల్లి-కాకినాడ టౌన్ రైలు(07446) ఫిబ్రవరి 3నుంచి మార్చి 30 వరకు, నర్సాపూర్-హైదరాబాద్ రైలు(07632), తిరుపతి-సికింద్రాబాద్ రైలు(07481) ఫిబ్రవరి 4 నుంచి మార్చి31 వరకు, సికింద్రాబాద్-తిరుపతి రైలు(07482) ఫిబ్రవరి 5నుంచి ఏప్రిల్ 1 వరకు , కాకినాడ టౌన్-లింగంపల్లి ప్రత్యేక రైలు (07445)ఫిబ్రవరి 2 నుంచి మార్చి 29వరకు పొడిగించినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతో అమరావతి రాజధాని

» కేశినేని శివనాథ్(చిన్ని)

విద్యాధరపురం, జనవరి 25 : మూడు నెలల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై అమరావతి రాజధానిగా కొనసాగుతుందని టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. అమరావతి పరిరక్షణ మహోద్యమం 1500 రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం వెలగపూడిలో జరిగిన అమరావతి శంఖారావం సభలో కేశినేని చిన్ని, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, అమరావతి రైతుల ఉద్యమానికి టీడీపీ మద్దతు ఉంటుందన్నారు. మూడు నెలల తరువాత జగన్‌రెడ్డి ఇంటికే పరిమితమవుతాడని తెలిపారు. వైసీపీ మునిగిపోయే నావ అని.. చాలామంది టీడీపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. మూడు నెలల తరువాత




మాట్లాడుతున్న కేశినేని శివనాథ్ (చిన్ని)

ఏపీలో ఏర్పడే ప్రజా ప్రభుత్వం అమరావతిలోనే రాజధాని నిర్మాణాలు చేపడతామని, అప్పటివరకు రైతులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఓటు ఆయుధంతో సీఎం జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. ఎన్నికల ముందు మెరుగైన రాజధాని అమరావతిలోనే నిర్మిస్తామని చెప్పి ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారన్నారు. రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధిని విస్మరించారన్నారు. మోదీ, జగన్ ఇద్దరూ తోడు దొంగలేనని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన పాపం ఇద్దరిదీ అని ఎద్దేవా చేశారు. రాజధానికి తమకు సంబంధం లేదని కోర్టులో బీజేపీ, కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. విశాఖ ఉక్కు నిలబడాలని, ప్రత్యేక హోదా రావాలని డిమాండ్ చేశారు. రాజధానిగా అమరావతిని కొనసాగించడమే కాకుండా రాజధానిలో ఉన్న రైతులకు కౌలు 20 సంవత్సరాలు పొడిగించాలన్నారు. ప్రజా ఉద్యమమే ఇప్పటివరకు అమరావతిని కాపాడిందని, భవిష్యత్తులోనూ రాష్ట్ర ప్రజల సంఘీభావం ఐక్యఉద్యమాన్ని నమ్ముకుంటేనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజధాని అమరావతి కార్యదర్శి ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్

విజయవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రేంజ్ నుంచి వచ్చిన కోమాకుల శివాజీకి సైబర్ క్రైం పీఎస్ 1లో పోస్టింగ్ ఇచ్చారు. ఇంతకుముందు ఆయన ఇదే పోస్టులో పనిచేశారు. వై.సత్యరమేష్‌కు సైబర్ క్రైం పీఎస్ 2ను కేటాయించారు. ఆర్.విజయ్‌కుమార్‌కు ట్రాఫిక్ 3లో పోస్టింగ్ ఇచ్చారు. బి.వెంకటేశ్వరరావును ట్రాఫిక్1లో నియమించారు. ఎస్.పరమేశ్వర్‌కు సీసీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం నుంచి వీఆర్‌లోకి వచ్చిన పలివెల శ్రీనుకు స్పెషల్‌బ్రాంచ్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ విభాగంలో ఉన్న కె.మహేంద్రకు స్పెషల్ బ్రాంచ్ అటాచ్‌మెంట్ ఇచ్చి ట్రాఫిక్2లో పోస్టింగ్ ఇచ్చారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌కే అహ్మద్ అలీని ట్రాఫిక్ 3కి బదిలీ చేశారు. ఎస్‌వీవీ లక్ష్మీనారాయణకు సీసీఎస్ అటాచ్‌మెంట్ ఇచ్చి పీసీఆర్ కేటాయించారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



మైలవరం, జనవరి 25 : ప్రియుడితో మనస్పర్థల కారణంగా మనస్తాపం చెందిన మహిళా కానిస్టేబుల్ చాలిఎంపరంబిల్ సురభి(24) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామంలో సచివాలయ మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సురభి నూజివీడు మండలం యలమందల గ్రామానికి చెందిన సురేష్ ప్రేమించుకున్నారు. బుధవారం రాత్రి ప్రియుడితో గొడవపడి ఆక్రమంలో గురువారం తెల్లవారుజామున మైలవరంలో దేవుని చెరువులో అద్దెకుంటున్న ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్సై ఎస్.హరిప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగేందుకు డబ్బివ్వలేదని

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

గుడివాడ : భార్య రూ.500లు ఇవ్వలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం స్థానిక కార్మికనగర్‌లో చోటుచేసుకుంది. ఒన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కార్మికనగర్‌కు చెందిన షేక్ కన్నా సాహెబ్(33) మద్యానికి బానిసయ్యాడు. సంక్రాంతి సెలవుల సందర్భంగా పిల్లలను ఏలూరు జిల్లా చేబ్రోలులోని వదిన ఇంటికి పంపించాడు. గురువారం పిల్లలను తీసుకురమ్మని భార్యకు రూ.2500లు యిచ్చాడు. మద్యం కోసం రూ.500లు తిరిగి ఇవ్వాలని భార్యను కోరాడు. డబ్బులు ఇస్తే తాగేస్తాడని భార్య డబ్బులు యివ్వకుండా ఊరు వెళ్ళింది. దీంతో స్నేహితుడి వద్ద డబ్బులు తీసుకుని మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యకు ఫోన్ చేసి తానేంటో చూపిస్తా అని సవాల్ విసిరాడు. తాగినప్పుడల్లా ఇదే విధంగా చస్తానని బెదిరిస్తుంటాడని భార్య పెద్దగా పట్టించుకోలేదు. పిల్లలను వెంటబెట్టుకుని ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని భర్త ఆత్మహత్య చేసుకోవడంతో హతాశురాలైంది. ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ద్రోహి జగన్ రెడ్డి

» తల్లి, చెల్లినే కాదు అంగన్వాడీ, డ్వాక్రాలకూ మోసం

» ఆసరా పేరుతో అక్క చెల్లెమ్మలకు టోకరా

» నెట్టెం రఘురాం, ఆచంట సునీతల ధ్వజం

జగ్గయ్యపేట, జనవరి 25 : రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళల్లో 75 శాతం మంది మహిళలకు సకాలంలో రుణాలు చెల్లించ లేదనే సాకుతో ఆసరా పథకం రాకుండా ఎగనామం పెట్టిన జగన్‌రెడ్డి మహిళా ద్రోహి అని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. చెల్లిని, తల్లిని మోసం చేసేందుకూ వెనుకాడని జగన్‌రెడ్డి అమరావతి మహిళా రైతులు, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు యానిమేటర్లు ఇలా మహిళలందరినీ కక్ష గట్టి వేధిస్తున్నాడని అన్నారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, డ్వాక్రా మహిళలు దాచుకున్న రూ.2158 కోట్లు అభయ హస్తం నిధులను దారి మళ్లించటం జగన్‌మార్క్ స్త్రీ సంక్షేమమని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం నాడు చంద్రబాబు రూ.800 కోట్లు ఇస్తే.. జగన్‌రెడ్డి 45 ఏళ్లకే పింఛన్ పేరుతో ఒక్కొక్క మహిళకు రూ.1.80లక్షలకు టోకరా వేశారని విమర్శించారు. రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికారత సంస్థ అధ్యక్షురాలు ఆచంట సునీత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల నివేదిక ప్రకారమే రాష్ట్రంలో మహిళలపై 2 లక్షలకు పైగా అత్యాచారాలు జరగటమే జగన్‌రెడ్డి పాలనలో జరిగిన మహిళా ఉద్ధరణ అని విమర్శించారు. డ్వాక్రా మహిళలను నిలువునా ముంచాడని ఆసరా కొందరికే దక్కిందని విమర్శించారు. చంద్రబాబు మానసపుత్రికలుగా డ్వాక్రా మహిళలు దేశంలోనే విప్లవాత్మక పొదుపు ఉద్యమాన్ని తీసుకువచ్చారని అన్నారు. సమావేశంలో విజయవాడ పార్లమెంట్ అంగన్వాడీ విభాగం ప్రధాన కార్యదర్శి గద్దె రాజ్యలక్ష్మి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే బీసీలకు సముచిత స్థానం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలనలో బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లలో కోత విధించడంతో పదవులు లభించకుండా పోయాయన్నారు. బీసీ కార్పొరేషన్ నిర్వీర్యమైందని, సబ్సిడీ రుణాలు రద్దు చేశారన్నారు. చంద్రబాబు హయాంలో బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పించారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ పలువురు తెలుగుదేశం నాయకులపై అక్రమ కేసులు పెట్టించి జైళ్లకు పంపారన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, గల్లా తిమోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి రవీంద్ర టీడీపీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

లలితాదేవికి పంచామృతాభిషేకాలు

గన్నవరం, జనవరి 25: యాదవుల రామాలయంలో పౌర్ణమి సందర్భంగా లలితాదేవి అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేశారు. తొలుత ఆలయ అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో పూజించారు.



యాదవుల రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు







గన్నవరం బాలుర హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్నికల అధికారి చంద్రలీల, బాపులపాడులో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న తహసీల్దార్ సునీల్‌బాబు, ఉంగుటూరులో తహసీల్దార్ వనజాక్షి

ఓటు వజ్రాయుధం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం ● ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు, ప్రతిజ్ఞలు, సీనియర్ ఓటర్లకు సత్కారాలు

గన్నవరం, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని అది వజ్రాయుధంతో సమానమని గన్నవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.చంద్రలీల అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం గన్నవరం బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఎంఈవో కొండా రవికుమార్, డీటీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వీరవల్లిలో సీనియర్ ఓటర్లకు సత్కారం

ఓటు సద్వినియోగంతోనే సుపరిపాలన సాధ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే మంచి పరిపాలన సాధ్యమవుతుందని ఓటర్లకు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల గోపాలకృష్ణ సూచించారు. రంగన్నగూడెంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. కసుకుర్తి సుబ్బారావు, కాట్రు పాపారావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, బీఎల్వో దుర్గాప్రసాద్, నజీమున్నీసా, హెచ్‌ఎం గ్లోరీ స్వర్ణలత పాల్గొన్నారు. వీరవల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఐదు గురు సీనియర్ ఓటర్లను సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి శ్యామలరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కోడెబోయిన బాబి, హెచ్‌ఎం నిర్మల, వీఆర్వో శేఖర్, మోర్ల ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

హనుమాన్‌జంక్షన్: ఓటు విలువను గుర్తించి వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని బాపులపాడు తహసీల్దార్ సునీల్‌బాబు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో సీనియర్ ఓటర్లను సత్కరించారు. హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు పెట్టి, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డీటీ వెంకట రమణ, హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఆర్ఐ రాజేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ఉంగుటూరు: ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ప్రతి ఒక్కరూ రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ డి.వనజాక్షి సూచించారు. జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం చోరగుడి అనిత అధ్యక్షతన నిర్వహించిన అవగాహనా సదస్సులో ముఖ్యఅతిధిగా వనజాక్షి పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటుకున్న విలువ, దాని ప్రాధాన్యాన్ని వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. గ్రామానికి చెందిన ఇద్దరు సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఎంఈవో-2 జె.సాంబశివరావు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఓటేయకపోతే ప్రశ్నించే హక్కు కోల్పోతాం

ఓటుహక్కును వినియోగించుకోనివారు, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే హక్కును కోల్పోతారని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. ఇందుపల్లి గ్రామసచివాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. సీనియర్ మహిళా ఓటర్లను సత్కరించారు. ఓటుహక్కు వినియోగంపై యువతీయువకులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎం.అమీర్‌బాషా, ఎంఈవో-2 జె.సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రంగన్నగూడెంలో అమరావతి ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్న రైతులతో జేఏసీ నేత ఆళ్ల గోపాలకృష్ణ, టీడీపీ నేత మొవ్వా వేణుగోపాల్

రాజధానికి భూములిచ్చిన రైతుల్ని

రోడ్డున పడేసిందీ ప్రభుత్వం

- రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసింది
- అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ నేత ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 25: వైసీపీ ప్రభుత్వం వికృత చేష్టలతో రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులను రోడ్డున పడేసిందని, ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చిందని అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ నేత ఆళ్ల గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. రంగన్నగూడెం రైతులతో కలిసి గురువారం అమరావతి సమర శంఖారావం కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. రాష్ట్రానికి మూడు రాజధానులంటూ వైసీపీ అమరావతికి మరణ శాసనం రాసి నేటికి 1500 రోజులు అయిందన్నారు. రాజధాని లేని రాష్ట్రం కావడంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వర్గాలు వెనకడుగు వేస్తున్నాయన్నారు. విద్యార్థులు, ప్రజలకు రాష్ట్ర రాజధాని ఏదో తెలియని పరిస్థితి ఉందన్నారు. టీడీపీ హయాంలోనే ఉద్యోగుల గృహసముదాయాలు 90శాతం, సీడ్ యాక్సెస్ రహదారులు 40శాతం పూర్తయినా వినియోగించుకోవడం చేతగాక ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రైతులు రాష్ట్రరాజధాని కోసం చేస్తున్న ఉద్యమాన్ని గుర్తించి, రాష్ట్రాభివృద్ధి కోసం అమరావతినే ఏకైక రాజ ధానిగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా వేణుగోపాల్, తుమ్మల దశరథరామయ్య, బెజవాడ వెంకట కృష్ణారావు, మొవ్వా శ్రీనివాసరావు, కసుకుర్తి అర్జున రావు, కొలుసు గంగాజలం, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్చాల్సింది ఎమ్మెల్యేలను కాదు..

సీఎం జగన్‌నే: దేవినేని రాజా

కంకిపాడు, జనవరి 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిని ముందుగానే సీఎం జగన్మోహన్‌రెడ్డి గ్రహించారని, ఓటమి భయంతోనే ఎమ్మెల్యేలను మారుస్తున్నారని, మార్చాల్సింది ఎమ్మెల్యేలను కాదని సీఎం జగన్‌నే మార్చాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. తిరుపతిలో నిర్వహించిన ఓ సమావేశంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి తన ఓటమిని నేరుగా అంగీకరించారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వైసీపీ నాయకులు, సర్పంచులు, ఎమ్మెల్యేలు విపరీతంగా దోచేసుకు న్నారని ఆరోపించారు. సర్పంచ్ పందిపాటి ఇందిర, పార్టీ గ్రామ అధ్యక్షుడు షేక్ షకార్, పందిపాటి సుధాకర్, కాకుళ్ల సుధాకర్ పాల్గొన్నారు.

బధిర విద్యాలయానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, జనవరి 25: ఏలూరు రోడ్డులోని ఆదిత్య బధిర విద్యాలయానికి విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి జీవీకే నారాయణ కుమార్తె వడ్లమూడి రాజ్యలక్ష్మి రమేష్ జన్మదినం సందర్భంగా గురువారం రూ.7వేలు విరాళ మిచ్చారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు పాఠశాల నిర్వాహకుడు ఆకుల వెంకటరమణకు నగదును అందించారు.







ఉయ్యూరు 14వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఆకునూరులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ, మంతెనలో అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న బోడె వెంకటరామ్

హామీలిచ్చి మాటతప్పిన జగన్

- **టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జి బోడె ప్రసాద్ విమర్శ**

ఉయ్యూరు, జనవరి 25: మద్యపాన నిషేధం, అంగన్వాడీ వర్కర్లకు వేతనాల పెంపు, 45 ఏళ్లకే పెన్షన్ హామీలిచ్చిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్నింటిని మరచి ప్రజలకు మొండిచేయి చూపారని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ విమర్శించారు. ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలోని 12, 13, 14 వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. అక్క చెల్లెమ్మలని కల్లబొల్లి కబుర్లు చెప్పే ముఖ్యమంత్రి డ్వాక్రా మహిళలను మోసం చేశారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అమలుచేసిన పథకాలను వివరించి, తిరిగి అధికారంలోకి వచ్చాక అమలుచేయబోయే సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిం చారు. మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, నాయకులు సంగెపు రంగారావు, గుర్నాథరావు, వాసు, దండమూడి చౌదరి, జయదేవ్, నాగరాజు, బూరెల నరేశ్, అప్పలనాయుడు, కౌన్సిలర్లు పలియాల శ్రీనివాసరావు, సుధారాణి, నజీర్, జనసేన నాయకులు చినకోటయ్య, వినయ్, కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోతో దళితులు, బీసీలకు మేలు

ఉయ్యూరు: టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో దళిత, బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ అన్నారు. ఆకునూరు బాబూ జగ్జీవన్‌రామ్‌నగర్‌లో గురువారం ఆమె బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో కలిగే ప్రయోజనాలు, లబ్ధిని ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనలో అన్నిధరలు పెరిగి ప్రజల నడ్డి విరుగుతుందని విమర్శించారు. ఎక్కడ పడితే అక్కడ మద్యం విచ్చలవిడిగా దొరుకుతోందన్నారు. కూలీనాలీ చేసి సంపాదించినదంతా తమ భర్తలు మద్యానికే పోస్తున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు వెలగపూడి వెంకన్న, కాకాని శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొండా ప్రవీణ్‌కుమార్, బొంతు మేరి, కిరణ్, శ్రీను పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బోడె ప్రసాద్ గెలవాలని పూజలు

కంకిపాడు: ప్రజల కోసం అహర్నిశలు పని చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వచ్చే ఎన్నికల్లో గెలవాలని ఆయన తనయుడు బోడె వెంకట్‌రామ్ మంతెనలో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం గ్రామంలో నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో వెంకటరామ్ పాల్గొన్నారు. టీడీపీ కంకిపాడు మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, కొణతం సుబ్రహ్మణ్యం, కాజా బ్రహ్మాజీ, టి.బుజ్జి, సన్ని, జనసేన పార్టీ నాయకులు రామిశెట్టి గోపాలకృష్ణ, కొండపల్లి వినోద్‌కుమార్ పాల్గొన్నారు. నెప్పల్లిలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కొలుసు గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో కోలవెన్ను శివరామకృష్ణ, చింతపల్లి కోటేశ్వరరావు, బొర్రా వెంకట్, రత్నబాబు పాల్గొన్నారు.



తాడిగడపలో జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న తాతపూడి గణేష్

టీడీపీ-జనసేన ప్రభుత్వ స్థాపనే లక్ష్యంగా పనిచేద్దాం

- ఇరుపార్టీల శ్రేణులకు నేతల పిలుపు

పెనమలూరు, జనవరి 25: సైకో జగన్‌రెడ్డిని గద్దె దించి టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపించడమే లక్ష్యంగా పనిచేద్దామని పార్టీ శ్రేణులకు టీడీపీ, జనసేన నేతలు పిలుపునిచ్చారు. గురువారం కానూరు పంటకాల్వ రోడ్డులో జనసేన తాడిగడప మునిసిపాలిటీ కార్యాలయ ప్రారంభానికి ఇరుపార్టీల నేతలు విచ్చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, జనసేన తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఐదేళ్ల సైకో పాలనలో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అన్ని వర్గాల వారికి అన్యాయం జరిగిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలయ్యేదాకా సమన్వయంతో ముందుకు సాగి, వైసీపీ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరుద్దామని ఇరుపార్టీల శ్రేణులకు పిలుపునిచ్చారు. గందరగోళ పరిస్థితుల్లో ఉన్న వైసీపీ నుంచి అనేక మంది కార్యకర్తలు, నాయకులు పక్క చూపులు చూస్తున్నారని, వైసీపీ మరింత బలహీనమవుతుందని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి జనసేన జెండాను ఆవిష్కరించారు. టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకర రావు, జనసేన నాయకులు నెరుసు ఆంజనేయులు, ముప్పా రాజా, రాయపాటి అరుణ, రావి సౌజన్య, గొల్ల శ్రీనివాస్, వీరన్‌కుమార్, వడ్డి జీవా, మాదాసు రాము, సమ్మెట సుధాకర్, చెన్నా గాంధీ, గంధం సురేష్, వన్నెంరెడ్డి కృష్ణారావు, ముంగి సుబ్బారావు, తిరుమలశెట్టి సుధీర్, గరికిపాటి ప్రసాద్, దోనెపూడి సురేష్, రాయంపూడి శ్రీను, చలమలశెట్టి రమేష్, పొదిలి దుర్గారావు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు సైన్సు ల్యాబ్ పరికరాలు అందజేత

హనుమాన్‌జంక్షన్, జనవరి 25: బాపులపాడు జడ్పీ హైస్కూల్ ప్లస్‌లోని ఇంటర్మీడియట్ ల్యాబ్‌కు రూ.20వేలు విలువైన పరికరాలను విశ్రాంత డివిజనల్ పంచాయతీ అధికారి శివలెంక నగేష్ గురువారం అందజేశారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉయ్యూరు, జనవరి 25: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నాచేసి తహసీల్దార్ మస్తాన్‌కు వారు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 11వ పీఆర్సీలో 2022 జనవరి 1 నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను యథావిధిగా ఇవ్వాలని, 70 ఏళ్లు నిండిన వారికి 10 శాతం, 75 ఏళ్లు నిండిన వారికి 15 శాతం పునరుద్ధరించాలని, 11వ పీఆర్సీ వెంటనే చెల్లించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధి రూ. 2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు సాంబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి హసన్ అహ్మద్, ట్రెజరర్ టీఎస్‌ఎం కోటేశ్వరరావు, మహిళా కార్యదర్శి పరాత్పరి, సత్యనారాయణ, నాగేశ్వరరావు, బాషా, మణిలాల్, విశ్వమోహన్ పాల్గొన్నారు.



తహసీల్దార్ మస్తాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.10 వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్, జనవరి 25: నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సహస్ర నామార్చన శాశ్వతపూజ కోసం జంక్షన్‌కు చెందిన భక్తురాలు ముప్పాళ్ల సామ్రాజ్యం గురువారం రూ.10వేలు విరాళాన్ని ఆలయ ఈవో వై.శ్రీనివాస్‌కు అందజేశారు. విరాళాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో ఏడాదిలో కోరిన ఒక రోజు స్వామికి పూజ నిర్వహిస్తామని ఈవో తెలిపారు. దాతకు ఆలయ అర్చకుడు చక్రావధానుల సీతారామాచార్యులు ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గుణదల, జనవరి 25: కార్పొరేట్ వైద్యానికి పేదలుదూరం కాకూడదన్న ఆలోచనతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని ప్రసాదంపాడులోని ఫస్ట్ మెస్సియా ఫెలోషిప్ కార్యనిర్వాహకుడు సజ్జా ప్రసాదరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి, ఇతర ఆస్పత్రుల వైద్యులు గురువారం శిబిరంలో వైద్య సేవలు అం దించారు. ప్రసాదంపాడు గ్రామంలోని 450మంది వచ్చి ఈసీజీ, రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయిం చుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు ప్రమోద్, మాధురిక, ప్రభుకుమార్, జమీల్‌అహ్మద్, కిరణ్‌కుమార్, లీలాకృష్ణ, మోహన్, నాగవజ్రకుమార్, దివ్య జాషవా, చైతన్య, వాసన్‌బకేర్ వైద్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలి



అవనిగడ్డ : వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్టును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అవనిగడ్డ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ప్రాంగణం వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. ప్రజల హక్కులకు భంగం కలిగించేలా ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకొచ్చిందని విమర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురాంప్రసాద్, న్యాయవాదులు మత్తి వెంకటేశ్వరరావు, అందె శ్రీరామ్మూర్తి, రంగనాథ్, పరుచూరి రాఘవేంద్రరావు, ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ, తూటారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హంస్మిక ఫణిదేవి

వక్తృత్వ పోటీల్లో శ్రీకాకుళం విద్యార్థిని హంస్మిక ఫణిదేవి ప్రతిభ

ఘంటసాల : జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఘంటసాల మండలం శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని హంస్మిక ఫణిదేవి ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు. సేవ్ ది గర్ల్ చైల్డ్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు. కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ జాషువా చేతులమీదుగా ప్రశంసాపత్రం, నగదు పురస్కారాన్ని హంస్మిక ఫణిదేవి అందుకుంది. ఈ సందర్భంగా హంస్మిక ఫణిదేవిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆడుదాం ఆంధ్రా ఖో-ఖో విజేత గుడివాడ

గుడివాడ : ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఖో-ఖో క్రీడా పోటీలు గురువారం ఎస్.పి.ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ పోటీల్లో పురుషుల, మహిళల విభాగంలో గుడివాడ జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. గుడ్లవల్లేరు ద్వితీయ, నందివాడ తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రథమ స్థానం సాధించిన జట్టుకు రూ.35 వేలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన జట్టుకు రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆడుదాం ఆంధ్రా క్రీడల కో-ఆర్డినేటర్ మడక ప్రసాద్, గేమ్స్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, మ్యాచ్ ఇన్‌చార్జ్ కె.అనురాధ, బి.అనిత, ఎం.జయ, జి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది మధు, మణికంఠ, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.



చిన్నాపురంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కొల్లు రవీంద్ర



బేతవోలులో ఇస్త్రీ చేస్తూ సమస్యలు తెలుసుకుంటున్న వెనిగండ్ల రాము



అవనిగడ్డలోని ఆరో వార్డులో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందజేస్తున్న వెంకట్రామ్

అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించాలి

● బాబు ష్యూరిటీలో కొల్లు రవీంద్ర, వెనిగండ్ల రాము

మచిలీపట్నం టౌన్, జనవరి 25 : టీడీపీ జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. చిన్నాపురం గ్రామంలో గ్రామదర్శిని, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. కొల్లు రవీంద్రతో పాటు తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ చైర్మన్ తలారి సోమశేఖర్, కొక్కిలిగడ్డ రమేష్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, తలారి రాంబాబు, సలీం, అయ్యప్ప, ఊకంటి రాంబాబు, రాయన శివ, దేవినేని సాయి తదితరులు గ్రామంలో పర్యటించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చిన్నాపురంలో ఆసుపత్రి నిర్మించామని, సీసీ రోడ్లు ఏర్పాటు చేశామని, గుండేరు బ్రిడ్జిని నిర్మించామన్నారు. రానున్న కాలంలో చిన్నాపురం గ్రామ పంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. **గుడివాడ :** బేతవోలు 28వ వార్డులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ, ఇంటింటికి తెలుగుదేశం నిర్వహించారు. వార్డు సమస్యలను వెనిగండ్ల ఎదుట ప్రజలు ఏకరువు పెట్టారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్లు కాటి విశాలి, శొంఠి రామకృష్ణ, పొట్లూరి కృష్ణారావు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్మాకరరావు, స్థానిక నాయకులు దింట్యాల రాంబాబు, కాకరాల సురేష్, వాసే మురళీ, పోలాసి ఉమామహేశ్వరరావు, గోర్జి సత్యనారాయణ, పులవర్తి డేవిడ్, కొడాలి రాజా, రెడ్డి అప్పారావు, కర్రా జయశ్రీ, ప్రియనాధుడు, సందు పవన్, వేమూరి త్రినాథ్, బుడమ రాజు, నాగిశెట్టి మణికంఠ, కొరడా పండు, నాగిశెట్టి లోకేష్, గోర్ల శ్రీలక్ష్మీ పాల్గొన్నారు. **అవనిగడ్డ :** మహాశక్తి పథకం భవిష్యత్తుకు గ్యారెంటీనిస్తుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. అవనిగడ్డలోని ఆరో వార్డులో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేసి 2024లో టీడీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ నాయకులు యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, అడపా శ్రీను, బచ్చు రఘునాథ్, బడే సుబ్బారావు, షేక్ బాబావలి, బర్మా శ్రీను, కటికల బాలాజీ, తుంగల శ్రీను, గరికపాటి హరి, గుగ్గిలం శ్యామ్, కొల్లూరి వాసు, దేగల రాఘవ, కొతవరపు వెంకటేశ్వరరావు, పాకెట్లపూడి నాగేశ్వరరావు, కొల్లూరు ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** తల్లీ, సొంత చెల్లి చీ కొట్టిన వ్యక్తి జగన్ ఇక ప్రజలకు అవసరం లేదని, ఎన్నికల్లో ప్రజలు జగన్‌ను తరిమి కొట్టటం ఖాయమని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. వల్లూరుపాలెంలో గురువారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్ - గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, చెన్నుపాటి శ్రీధర్, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఈడే వాసు, కొనకాల వాసు, ఉప్పులూరి గోపాలకృష్ణ పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పామర్రు :** జగన్ సైకోపాలనతో ప్రజలు విరక్తి చెంది టీడీపీ అధినేత చంద్రబాబుకు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్లకుమార్‌రాజా అన్నారు. పామర్రు 18వ వార్డులో గురువారం బాబుష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ టీడీపీ అమలు చేసే ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. దాలిపర్తి ప్రసాద్, మంతెన రామాంజనేయులు, పరసా సుబ్రమణ్యం, పానుగంటి సందీప్, కేదరాసిపల్లి శ్రీనివాసరావు, మనోజ్, విజయశ్రీ పాల్గొన్నారు. అనంతరం అడ్డాడ గ్రామంలో జరిగిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు.



వల్లూరుపాలెం బాబు ష్యూరిటీలో వర్ల కుమార్ రాజా



చల్లపల్లిలో..



అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో...



పెడనలో...



తోట్లవల్లూరులో...

సీనియర్ ఓటర్లకు సత్కారం

మోపిదేవి : జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం గురువారం మోపిదేవిలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ఓటు ఆవశ్యకతను తెలియజేసేలా నినాదాలు చేశారు. ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కె.నవీన్ కు మార్, ఎస్సై సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** జాతీయఓటర్ల దినోత్సవాన్ని చంద్రాల ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించారు. వీఆర్వో ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. **చల్లపల్లి :** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం గ్రామాల్లో నిర్వహించారు. చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, తహసీల్దార్ కె.గోపాలకృష్ణలు పాల్గొని సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, వీఆర్వో చల్లపల్లి ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.సుధాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరుగురు సీనియర్ సిటిజన్లను సత్కరించి, కళాశాల విద్యార్థులకు ఓటు ఆవశ్యకతను వివరించారు. ఈఆర్వో పి.పార్వతీ, తహసీల్దార్ శివరామకృష్ణ, ఎంపీడీవో మరియదేవి, ఎంఈవోలు శివశంకరరావు, పిచ్చియ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** మోదుమూడి సచివాలయంలో సీనియర్ సిటిజన్ బచ్చు కమల నాగయ్యను వీఆర్వో సిద్దాబత్తుని నారాయణరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పులిగడ్డ ప్రాథమిక పాఠశాలలో సీనియర్ సిటిజన్ భోగాది వెంకట సుబ్బారావును ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి ఆధ్వర్యంలో ఓటు హక్కు గురించి వివరించారు. బీఎల్వో భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. **పామర్రు :** జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి షాహెద్‌బాబు సీనియర్ సిటిజన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొగ్గరపు జాలయ్య (93)ను ఘనంగా సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. హెచ్‌ఎం ఎస్.ఇందిర, తహసీల్దార్ భరత్‌రెడ్డి, ఎన్నికల డీటీ జగన్మోహనరావు పాల్గొన్నారు. **పెడన :** పట్టణంలోని భట్ల జ్ఞాన కోటయ్య జడ్పీ హైస్కూల్‌లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ముడా వైస్‌చైర్మన్, పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె. రాజ్యలక్ష్మి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. సభానంతరం ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్, దివ్యాంగ ఓటర్లను సన్మానించారు. వక్తృత్వ వ్యాస రచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్లు పి. మధుసూదనరావు, విజయప్రసాద్, ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, ఎంఈవో-2 హరనాథ్, ఎన్నికల డీటీ కల్పన పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ కుసుమకుమారి అన్నారు. తోట్లవల్లూరులో గురువారం ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్‌ని సత్కరించారు. గ్రామ సర్పంచ్ పెనుముత్స రాధిక, ఎంపీడీవో స్వర్ణలత, వీఆర్వోలు డి నాగేశ్వరరావు, అసదుల్లా తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

గుడివాడ రూరల్, జనవరి 25 : అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గుడివాడ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. పెన్షనర్ల సంఘం గుడివాడ యూనిట్ అధ్యక్షుడు భవిరి శంకర్‌నాథ్, ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు కె.పి.రావు, గుడివాడ ఎన్జీవో నాయకులు రాజేంద్ర ప్రసాద్ సమస్యలు తక్షణం పరిష్కరించాలన్నారు. అనంతరం ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్ ఆంజనేయులకు వినతిపత్రాలు అందజేశారు. సంఘం కోశాధికారి బొమ్మదేవర సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అరసవల్లి నాగాచారి, సంఘ ప్రముఖులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపాల్ గన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు ఎస్సై రాజేంద్రప్రసాద్ బదిలీ

కోడూరు : కోడూరు సబ్ ఇన్‌స్పెక్టర్ వి.రాజేంద్ర ప్రసాద్ ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. గురువారం రిలీవ్ అయినట్లు ఆయన తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలూరు రేంజ్ కు బదిలీపై వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్టేషన్ సిబ్బంది ఆయనను ఆత్మీయంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

హుండీ ఆదాయం రూ.5.69 లక్షలు

గుడివాడ : గౌరీశంకరస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.5,69,362 వచ్చినట్లు ఈవో నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆలయాల తనిఖీ అధికారి వి.సుధాకర్ సమక్షంలో కానుకల లెక్కింపు జరిపారు. మాజీ ధర్మకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

కూచిపూడి : ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ మేడూరి జశ్వంతరావు కుటుంబానికి ఎస్సై సందీప్, సిబ్బంది సమకూర్చిన రూ.35 వేలను పామర్రు సీఐ సుభాకర్ చేతులమీదుగా బాధిత కుటుంబసభ్యులకు గురువారం అందజేశారు. విధి నిర్వహణలో కానిస్టేబుల్ చేసిన సేవలు కొనియాడుతూ వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

మొవ్వలో అకాల వర్షం

కూచిపూడి : మొవ్వలో గురువారం అకాల వర్షం కురిసింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మొవ్వ పరిసర గ్రామాలకు చెందిన రైతులు కుప్ప నూర్పిళ్ల కార్యక్రమం చేపట్టారు. అకాల వర్షంతో ధాన్యాన్ని రక్షించుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. ధాన్యం రాశులపై వరి గడ్డి, పరదాలు కప్పారు.



వైభవంగా కావడి సేవ

మచిలీపట్నం టౌన్ : కార్తికేయ ట్రస్టు ఆధ్వర్యంలో మచిలీపట్నంలో గురువారం వైభవంగా కావడిసేవ మహోత్సవం జరిగింది. కావడిసేవను గుడివాడ ప్రణవనంద ఆశ్రమ అధిపతి స్థైర్యానంద సరస్వతి ప్రారంభించి మాట్లాడారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, వాలిశెట్టి తిరుమలరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తొలగించాలి

చల్లపల్లి : ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీర్చాలని మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన గురువారం మండల సమావేశం జరిగింది. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు మాలెంపాటి శ్రీనివాసరావు దూరాన ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయింపుతో రైతులు అదనపు వ్యయం చెల్లించాల్సి వస్తోందన్నారు. ఆఫ్‌లైన్ విధానం అమలుచేయాలని ఉన్నతాధికారులను కోరామని ఏవో జి.సాయి సింధు తెలిపారు. మురుగుకాల్వల్లో గుర్రపుడెక్క తొలగింపు, ఇతర అంశాలపై చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు సమస్యలు లేవనెత్తారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటం తదితర అంశాలపై ఎంపీపీ కోట విజయ రాధిక అధికారులకు పలు సూచనలు చేశారు.

సచివాలయ భవనం ప్రారంభం

కూచిపూడి : మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలో గురువారం పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించి అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, రాజులపాటి రాఘవరావు, చలసాని వెంకటరత్నం, సమ్మెట ఆంజనేయులు, కైతేపల్లి అన్నామణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్వోలకు ప్రశంసా పత్రాలు

మోపిదేవి : కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు జాబితా సవరణలో భాగంగా అత్యంత ప్రతిభ కనబర్చిన బూత్ స్థాయి అధికారులకు తహసీల్దార్ కె.నవీన్ కుమార్ గురువారం ప్రశంసాపత్రాలు అందజేశారు. మండల పరిధిలో మోపిదేవి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు, మత్తి గోపాలకృష్ణ ప్రసాద్, గొరిపర్తి సుధాకర్‌లను ఉత్తమ ఎన్నికల సూపర్‌వైజర్, బీఎల్వోలుగా ప్రకటించి, తహసీల్దార్ అభినందించారు.

ఉద్యోగాలకు 109 మంది ఎంపిక

గుడివాడ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 14 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 423 మంది హాజరు కాగా 109 మంది వివిధ కంపెనీల్లో నియామక పత్రాలను అందుకున్నారు. కార్యదర్శి వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు, ఉపాధి అధికారి విక్టర్‌బాబు, స్కిల్ డెవలప్ మెంట్ అధికారి శ్రీనివాసరావు, టీపీవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



మహిళలకు శిక్షణ ముదావహం

మచిలీపట్నం టౌన్ : ఆధునిక ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం ముదావహమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. ఖాదీజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలలుగా మహిళలకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులను ఆయన సత్కరించి ప్రసంగించారు. సామా నా కాలేజ్ ఆఫ్ డిజైనింగ్ స్టడీస్ మేనేజింగ్ ట్రస్టీ సామానా మూనవి, ఎండి అల్తాఫ్ హుస్సేన్, మహమ్మద్ ఇమ్రాన్, షీబా అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.